క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పవనపుత్రా పాహిమాం..



ధరూరు: మండలంలోని అల్వలపాడు గ్రామ శివారులోని తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అంకురార్పణ, ధ్వజారోహనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండో రోజు గురువారం స్వామి వారి ఉపనయనం, తెప్పోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అంతకుముందు ఆలయంలోని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయ నామస్మరణ మార్మోగింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని నది అగ్రహారం రోడ్డులో 132 కేవీ గద్వాల సబ్‌స్టేషన్‌లోని 33 కేవీ ఫీడర్ మరమ్మతు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ల మరమ్మతు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో మల్దకల్, బిజ్వారం పరిధిలో ఉప కేంద్రాలకు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు వివరించారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అశోక్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ రమణారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన



గద్వాల అర్బన్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరిబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని వెంకంపేటలో గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆకు కూరలు, పండ్లు, పాలు, తృణధాన్యాలు తదితర వాటిని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. రక్తహీనతను నివారణకు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ



గద్వాలరూరల్: జిల్లా కేంద్రంలోని అంధుల పాఠశాల, బాలసదన్ విద్యార్థులతో బుధవారం గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. పాతబస్టాండ్‌లో ప్రజలకు అన్నదానం చేశారు. జెడ్పీవైస్ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడాకారులకు చేయూత



మానవపాడు: మండలంలోని అమరవాయిలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో బుధవారం క్రీడాకారులకు వస్తు సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులకు ప్రోత్సాహించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యువకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిక్క వీరేశ్వర స్వామి ఉత్సవాలు



స్వామి ఊరేగింపులో గ్రామస్తులు

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఎద్దుల బండిపై ఆలయ అర్చకుడి ఇంటి నుంచి ఆలయం వరకు ఊరేగించారు. స్వామివారి శోభ యాత్ర మేళతాళాలతో, భాజా భజంత్రీలు, పటాకుల శబ్దాలతో ఆలయం వరకు కొనసాగింది. యువకులు నంది కోళ్ల సేవ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. దేవతామూర్తుల వేషధారణతో కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఆలయం వద్ద రాత్రి కలశ స్థాపన నిర్వహించారు. స్వామి వారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వివిధ జిల్లాల భక్తులతోపాటు కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రైతులకు అండగా ఉంటాం



ప్రాగటూరులో మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

ఉండవెల్లి: రైతులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి ఎస్ఏ సంపత్ కుమార్ అన్నారు. బుధవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండలంలోని మండల కేంద్రం, చిన్న ఆముదాలపాడు, ప్రాగటూరు, శేరుపల్లె గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాదయాత్రగా వెళ్లి ప్రజలను పలకరిస్తు ముందుకు సాగారు. పార్టీని బలపరచాలని, కాంగ్రెస్‌కు ఒక్క చాన్స్ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళ అధ్యక్షురాలు నాగశిరోమణి, వడ్డేపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ సుజాత, సర్పంచులు శేషన్ గౌడ్, నాగేష్, ఎంపీటీసీ హారిక, మండల అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు నాగరాజు, రమేష్, రాజు రెడ్డి, మద్దిలేటి, రామాచారి, మధు, నయీం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న వృషభరాజులు

రాజోళి: మండలంలోని తుమ్మిళ్లలో ఎల్లమ్మ జాతర సందర్భంగా బుధవారం బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త జల్లాపురం కిషోర్‌కుమార్ హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు సంబరాల్లో భాగంగా జరిగిన బండలాగుడు పోటీల్లో రైతులు ఉత్సాహంగా పాల్గొనం సంతోషకరమన్నారు. విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ, నాల్గో, ఐదో బహుమతులను బహుమతులను అందచేశారు. అనంతరం దాత కిషోర్‌కుమార్‌ను రైతులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుక, గజేంద్ర, రమేష్, రంగనాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి



హాజరైన అధికారులు, సభ్యులు

రాజోళి: అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ మరియమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంఆర్‌సీ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజ ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందు కెళ్లాలని సూచించారు. అంతకుముందు సభ్యులు గ్రామాలలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. డ్రెయినేజీ, విద్యుత్, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, వివిధ సమస్యలను లేవనెత్తారు. అధికారులు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండపడ్డారు. అనంతరం ప్రతి శాఖ అధికారితో ఆ శాఖకు సంబంధించిన అభివృద్ధి, నిలిచిన పనులు, చేయాల్సిన ప్రగతిపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుగుణమ్మ, వైస్ ఎంపీపీ రేణుక, ఎంపీడీఓ గోవిందు రావ్, ఎంఈపీఓ ఖజా, జెడ్పీకో ఆప్షన్ సభ్యుడు నిషాక్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా చేయాలని నిరసన



సబ్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహిస్తున్న రైతులు

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాల సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని కేటీదొడ్డి, కొండాపురం, ఉమిత్యాల, ఉమిత్యాలతండా గ్రామాల రైతులు బుధవారం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. రెండు గంటల పాటు నిరసన తెలిపారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయన్నారు. విద్యుత్ సరఫరా స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ధర్నా విరమించబోమని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ జిక్కిబాబు అక్కడికి చేరుకొని శాంతింపజేసినా నిరసన కొనసాగించారు. విద్యుత్ అధికారులు ఏడీ రమేష్‌బాబు, ఏఈ శివకుమార్‌తో ఎస్ఐ మాట్లాడారు. రోజుకు 12 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో రైతులు కర్రెప్ప, శ్రీపాదరెడ్డి, కోళ్ల రంగప్ప, వీరేష్, జమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు



మానవపాడులోని పెద్దఆముదాపాడులో కంటివెలుగు పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

మానవపాడు: మండలంలోని పెద్దఆముదాపాడులో బుధవారం డాక్టర్ యాకుబ్‌భాషా ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. మొతం 133 మందికి కంటి పరీక్షలు చేయగా 16 మందికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, సిబ్బంది, చంద్రన్న, రాణెమ్మ, ప్రసన్న, చిట్టెమ్మ, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంతో పాటు లింగాపురం గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆయా గ్రామాల్లో కంటి పరీక్షలు వైద్యులు నిర్వహించారు. రెండు గ్రామాల్లో మొత్తం 285 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, రీడింగ్ గ్లాసులు 16 మందికి పంపిణీ చేయగా, 21 మందికి ఆర్డర్ గ్లాసుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యాధికారి శశికిరణ్, తిమ్మప్పలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్, స్వర్ణలత, సీహెచ్ఓ ఊసేని, సూపర్‌వైజర్ విఘ్నేశ్వరి, ఏఎస్ఎం జయమ్మ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న డీసీపీఓ నరసింహ

శాంతినగర్: ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత అని డీసీపీఓ నరసింహ అన్నారు. బుధవారం వడ్డేపల్లి మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం, మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ వివక్ష, ఆడపిల్లల మనుగడ, రక్షణ, విద్య గురించి విద్యార్థినులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆడపిల్లల రక్షణ కోసం ప్రభుత్వం 1098 ప్రవేశపెట్టిందని, ఎవరికైనా ఆపద వస్తే టోల్‌ఫ్రీ నంబర్‌కు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యుడు ప్రకాష్ బేటీ పడావో, బేటీ బచావోపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సురేష్, ఎంపీఎఫ్ అనిమిరెడ్డి, బడేసాబ్, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనులు పరిశీలన

అలంపూర్: పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీలో బుక్కాపురం రోడ్డు పక్కన మిషన్ భగీరథ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ బుధవారం పరిశీలించారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మిషన్ భగీరథ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన అధికారులు పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు చేపట్టారు. మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆమె సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా కోరారు. కార్యక్రమంలో వినోద్, వెంకటేష్, అరుణ్, కిరణ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి



గట్టు: విద్యుదాఘాతంతో పశువులు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని బల్గెరలో చోటుచేసుకుంది. గ్రామస్తులు వివరాల ప్రకారం రైతు కుర్వ తాయప్పకు సంబంధించిన పశువులను మేత కోసం సమీపంలోని వ్యవసాయ పొలానికి తీసుకెళ్లాడు. మధ్యాహ్న వేళ నీళ్లు తాగేందుకు పశువులు సమీపంలోని నెట్టెంపాడు కాలువలోకి దిగాయి. కాలువలో ఉన్న కరెంట్ మోటార్ల కారణంగా 3 ఆవులు, కోడెదూడ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. పశువుల విలువ రూ.80 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గట్టు: మండలంలోని తుమ్మలచెరువు గ్రామానికి చెందిన కావలి ఆంజనేయులు(32) రోడ్డు ప్రమాదంలో గాయపడి, కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్ఐ పవన్‌కుమార్ వివరాల ప్రకారం గత నెల 30న గ్రామ సమీపంలో కావలి ఆంజనేయులు వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడటంతో గద్వాల ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలు

అలంపూర్: డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కర్నూల్ చెందిన వంశీ, రవితో పాటు చిన్నారి ఉండవెల్లి నుంచి కర్నూల్‌కు బైక్‌పై వెళ్తున్నారు. అలంపూర్ చౌరస్తాలోని 44వ నెంబర్ జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో వంశీ, రవిలకు గాయాలయ్యాయి. చిన్నారి సురక్షితంగా బయటపడ్డది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అరెస్టులతో ఉద్యమం ఆపలేరు



శాంతినగర్: యాదవుల సమస్యలు పరిష్కరించేవరకు ఉద్యమం ఆగదని యాదవహక్కుల సమితి జాతీయ కార్యదర్శి కొంకల అమర్‌యాదవ్ అన్నారు. యాదవులకు ప్రత్యేక కార్పోరేషన్, రెండో విడత గొర్రెల పంపిణీపై అసెంబ్లీ ముట్టడికి సందర్భంగా బుధవారం పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టులతో ఉద్యమం ఆపలేరని హెచ్చరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అక్కడనుంచి నాంపల్లి కోర్టుకు తీసుకెళ్లారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు ఆర్జించవచ్చని మండల వ్యవసాయ అధికారి అయూబ్ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని బట్లదిన్నెలో చాగాపురం రైతులకు ఆయిల్ పామ్ పంట సాగు, ఆదాయం, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఇతర పంటలతో పోలిస్తే చీడపీడల బాధ తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భరత్, రైతులు, తదితరులు ఉన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

అయిజ: మండలంలోని గుడుదొడ్డిలో బుధవారం శివమాల ధరించిన భక్తులు శివుడి చిత్రపటంతో గ్రామంలోని వివిధ ప్రధాన రహదారుల్లో ఊరేగింపుగా వెళ్లి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి శివ మాలధారులు హాజరయ్యారు. శివలింగానికి అభిషేకాలు అనంతరం మెట్లపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గట్టు: మండలంలోని ఆరగిద్దలో బుధవారం శివ స్వాములు మెట్లపూజను ఏర్పాటు చేశారు. శివమాలధారులు శివ, పార్వతుల మెట్ల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శివస్వాములకు అన్నదానం నిర్వహించారు.

పశు సంపదను కాపాడుకుందాం



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

అయిజ: పశు సంపదను కాపాడుకుందామని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని మేడికొండలో వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వరూపారాణి ఆధ్వర్యంలో రైతులకు పశువుల కృత్రిమ గర్భాధారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి హాజరై మాట్లాడారు. పశువుల్లో కృత్రిమ గర్భాధారణ వలన సాధారణ పశువుల నుంచి మేలుజాతి పశు సంపదను పొందవచ్చన్నారు. గిరి, సయివాల్, ఒంగోలు సేమెన్స్ తదితర పశువులు జాతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏ సుధాకర్, జేనియర్ అసిస్టెంట్ భీమయ్య, గోపాల మిత్ర సూపర్‌వైజర్ సూర్యారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చిన్నారికి చేయూత



ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ అందజేస్తున్న సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లికి చెందిన ఓ చిన్నారి వెన్నుముక, కండరాల క్షీణత వ్యాధితో శ్వాస తీసుకునేందుకు ఇబ్బందులు పడుతోంది. చిన్నారి వైద్యం కోసం బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు చిన్నారి చికిత్స కోసం వైద్యులు శ్యామ్, అశోక్‌ల సహకారంతో రూ. 40 వేల విలువజేసే ఆక్సిజన్ కాన్సెంట్రేడర్ బుధవారం అందజేశారు. కష్టాకాలంలో మానవతాదృక్పథం చాటుకున్న దాతలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబులిటీ సభ్యులు సంధ్య అశోక్, సంజీవ్, శివ ప్రసాద్, నాగరాజు, మురళి, పరుశరాముడు, చందు ఉన్నారు.

బీజేపీతోనే సబ్బండవర్గాలకు మేలు



నియామక పత్రాలను అందజేస్తున్న రామచంద్రారెడ్డి

అయిజ: బీజేపీతోనే సబ్బండవర్గాలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో అలంపూర్, గద్వాల నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు మెడికల్ తిరుమలరెడ్డి, రామాంజనేయులు సమక్షంలో మండల స్థాయి ఇన్‌చార్జ్‌లను నియమించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు హాజరయ్యారు. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేకత పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. అనంతరం మల్దకల్ మండల అధ్యక్షుడు బీరెల్లి రాధాకృష్ణారెడ్డి, అయిజ అధ్యక్షుడు శాంతినగర్ మధుసూదన్‌గౌడ్, రాజోళి అధ్యక్షుడు మేడికొండ భీమసేన రావు, వడ్డేపల్లి అధ్యక్షుడు రంజిత్ పటేల్, ఉండవెల్లి అధ్యక్షుడు సింధనూరు రమేష్‌లను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గట్టు: బీఆర్ఎస్ ప్రభుత్వ ఆగడాలను ఎండగడదామని ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి జలగిరి అశోక్, జిల్లా అధికార ప్రతినిధి నాగేందర్‌యాదవ్‌లు పిలుపునిచ్చారు. బుధవారం బల్గెరలో మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి అధ్యక్షతన మండల స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరెంట్ కోతలపై రైతులు కన్నెర్ర చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీడీ చార్జీల పేరుతో గృహ వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారని, ఇదేంటని ప్రశ్నించే వారిపై విజిలెన్స్ అధికారులతో కేసులను నమోదు చేయించి జైలుకు పంపుతున్నారని మండపడ్డారు. గ్రామంలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓంకార్, నాగప్ప, రామకృష్ణారావు, రమేష్, రాజుగౌడ్, రాజప్ప, చిట్టెయ్య, నర్సింహులుగౌడ్, ఆంజనేయులు, అహ్మద్‌అలీ, రాఘవేంద్రచారి, సిద్దప్ప, వీరశేఖర్‌గౌడ్, భీమన్న పాల్గొన్నారు.

క్రషర్ మిషన్ పనులు నిలిపివేత



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు

గట్టు: మండలంలోని జోకన్‌గట్టు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న క్రషర్ మిషన్ పనులను బుధవారం ప్రజాప్రతినిధులు నిలిపివేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎంపీపీ విజయ్‌కుమార్, రాయాపురం సర్పంచు ప్రవీన్‌కుమార్, తారాపురం సర్పంచు నల్లన్నగౌడు, ఎంపీటీసీ రంగస్వామితో పాటుగా ఆయా గ్రామాలకు చెందిన పలువరు జోకన్‌గట్టుకు చేరుకొని క్రషర్ మిషన్ పనులను అడ్డుకున్నారు. జోకగన్‌గట్టు సమీపంలో ఏర్పాటు చేసిన క్రషర్ మిషన్‌ను ఎంపీపీతో పాటుగా ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు సందర్శించారు. పంట పొలాల్లో దుమ్ము చేరి, పంటలు దెబ్బతింటున్నాయని, షెగ్రిగేషన్ షేడ్లు, వైకుంఠదామం, పల్లెప్రకృతి వనాలు దుమ్ము, ధూళితో నిండాయని వాపోయారు. పంచాయతీల తీర్మాణం లేకుండానే క్రషర్ మిషన్‌ను ఏర్పాటు చేశారని పనులు నిలిపివేయాలని తహసీల్దార్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మిట్టదొడ్డి సర్పంచు నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు గద్వాల తిమ్మప్ప, పాగుంటప్ప, కర్రెప్ప, గోవిందు, పెద్ద వెంకటేష్, సిద్దు, పరమేష్, నర్సింహులు, గూరన్న, రాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు వినతి



ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

గద్వాల అర్బన్: అంగన్‌వాడీ టీచర్ల, సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్సీ కవితను కోరారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అబ్రహం, మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డిలతో కలిసి హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితకు వినతి పత్రం అందజేశారు. మహిళల, చిన్నారుల అభ్యున్నతికి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎంతో తోడ్పాటు ఇస్తున్నారని వివరించారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేస్తున్నామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు సౌదమని, జిల్లా అధ్యక్షురాలు ఇందిరమ్మ, ఉపాధ్యక్షురాలు గిరిజ, వీరమ్మ, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

కార్మికులు తరలిరావాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: హమాలీ కార్మికుల సమస్యల పోరాటానికి కార్మికులంతా ఏకం కావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కృష్ణ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని కొండేరులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను నాయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అసంఘటిత కార్మికుల సమస్యలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలన్నారు. కనీస వేతనాల జీవోను ప్రభుత్వం వెంటనే సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 9న హైదరాబాద్‌లోని లేబర్ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్తిక్, రాఘవేంద్ర, బండ్లయ్య, మద్దిలేటి, అంజి, నాగరాజు, వీరన్న, తదితరులు ఉన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి



మల్దకల్‌లో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కార్మికులు

మల్దకల్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న అసంఘటిత కార్మికుల సమావేశానికి కార్మికులు హాజరై విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహా పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను పంచాయతీ కార్మికులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న జనగామ నియోజకవర్గంలోని పాలకుర్తి గ్రామం నుంచి పాదయాత్రగా బయలుదేరి 17న హైదరాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రాజు, విజయ్, భాష, తాయమ్మ, సవారమ్మ, ప్రేమమ్మ, వజ్రమ్మ, భీసమ్మ, శారదమ్మ, గోకారి తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బంది సమస్యల సాధన కోసం చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు విజయ్‌కుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రామకృష్ణ, కోటి, చిన్న దస్తగిరి పాల్గొన్నారు.